అక్షరశక్తి
The Power of Pen
Evening Daily

సంపుటి: 20 | సంచిక: 335 | వరంగల్ | గురువారం, 15 అక్టోబర్ 2026 | పేజీలు: 05

దసరా పండుగ వచ్చిందంటే కొత్త బట్టల కొనుగోళ్ల తో వస్త్ర దుకాణాలు కళకళలాడుతాయి. ముఖ్యంగా వరంగల్, హనుమకొండ నగరాల్లోని వస్త్ర దుకాణాలకు, కిరాణా సామాను పండుగ సీజన్ కీలకమైన వ్యాపార సమయం. అయితే ఈసారి దసరాకు ముందునుంచే పండగ వ్యాపారం ఆశించిన స్థాయిలో సాగడం లేదనే ఆందోళన వ్యాపార వర్గాల్లో కనిపిస్తోంది. పండుగ సీజన్‌లో సాధారణంగా ఉండే కొనుగోళ్ల సందడి తగ్గడానికి గల కారణాలపై చర్చ జరుగుతోంది. ఒకవైపు అనూహ్యంగా అన్ని వస్తువుల మీద పెరుగు తున్న రెట్లు, వర్షా లు లేకపోవడం, ఎల్ నినో భయం భవిష్యత్తు ఎలా ఉంటుందో అన్న సందేహాలు ఖర్చుల పరిమితులపై ప్రజలు స్వీయ ఆంక్షలు విధించుకుంటున్నట్టు తెలుస్తున్నది. సాధారణ బడ్జెట్ కు మించి ఖర్చులు పెరగడం, ఆన్లైన్ కొనుగోళ్లు పండగ మార్కెట్ పై ప్రభావం చూపుతున్నాయి. - అక్షరశక్తి, ప్రధాన ప్రతినిధి

దసరా!

వెలవెలబోతున్న వ్యాపారం



నగరంలో మందగించిన బట్టల వ్యాపారం

కొనుగోళ్లపై ప్రజల ఆచితూచి అడుగులు

ఆన్‌లైన్ విక్రయాలతో స్థానిక వ్యాపారులకు పోటీ

తగ్గిన కొనుగోలు శక్తి

5

దసరా నుంచి సూపర్ స్పెషాలిటీ
ఆసుపత్రిలో ఓపీ సేవలు!

- నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రులు..
- ఉత్తర తెలంగాణ ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తాం: పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



వరంగల్‌లో నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా గురువారం ఆసుపత్రి నిర్మాణ పనులను వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి ధనసరి సీతక్క, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి తదితర రాష్ట్ర, జిల్లా నాయకులు, అధికారులు పరిశీలించారు. - అక్షరశక్తి, వరంగల్

5



విద్యుత్ సంక్షోభానికి ప్రభుత్వ అనాలోచిత
నిర్ణయాలే కారణం

సింగరేణి బకాయిలు చెల్లించి బొగ్గు ఉత్పత్తి పెంచాలి: గంద్ర

3

చిరు వ్యాపారులపై దాడులు ఆపాలి

ట్రైసిటీలో ప్రత్యేక సంతలు ఏర్పాటు చేయాలి: బీఆర్టీయూ, చిరు వ్యాపార సంఘాల నేతలు



2



రూ.1.20 లక్షల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన అసిస్టెంట్ ఇంజినీర్

విద్యుత్ మీటర్ల మంజూరుకు లంచం డిమాండ్

విద్యుత్ మీటర్ల మంజూరు కోసం రూ.1,20,000 లంచం తీసుకుంటూ హైదరాబాద్‌లోని మదన్నపేట విద్యుత్ విభాగం అసిస్టెంట్ ఇంజినీర్ పందాల సందయ్య రాకేష్ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు పట్టుబడ్డారు. గురువారం (అక్టోబర్ 15, 2026) ఏసీబీ సిటీ రేంజ్-2 అధికారులు ఈ చర్య చేపట్టారు. - అక్షరశక్తి, హైదరాబాద్

5

ఎస్ఐగా సృజన్ బాధ్యతల స్వీకరణ




అక్షరశక్తి, హనుమకొండ క్రైమ్: పాలకుర్తి పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ (ఎస్ఐ)గా సృజన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన పవన్ ధర్మసాగర్ పీస్ కి బదిలీ కాగా, దేవరుప్పుల ఎస్ఐగా పనిచేసిన సృజన్ బదిలీపై పాలకుర్తి కి వచ్చారు. ఈసందర్భంగా ఎస్ఐ సృజన్ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై నేరుగా పోలీస్ స్టేషన్ కు వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఘనంగా అబ్దుల్ కలాం 95వ జయంతి వేడుకలు



అక్షరశక్తి,గూడూరు: గూడూరు మండలం అబ్దుల్ కలాం వాకర్స్ అసోసియేషన్స్ వారు రామేశ్వరంలోనీ ఏపీజే అబ్దుల్ కలాం ఇంటిదగ్గర ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో అబ్దుల్ కలాం వాకర్స్ అధ్యక్షులు ముయ్యబోయిన వెంకన్న మాట్లాడుతూ రామేశ్వరంలో జన్మించి నిరుపేద కుటుంబం నుండి భారత రాష్ట్రపతిగా పనిచేయడం ఎంతో గర్వకారణం .తెలంగాణ రాష్ట్రంలో వారి యొక్క పేరును అబ్దుల్ కలాం వాకర్స్ గా మేము పెట్టుకొని వారి యొక్క పుట్టినరోజు ను వారి ఇంటి వద్ద నిర్వహించుకోవడం చాలా సంతోషం అని అన్నారు. భారతదేశానికి వారు అందించిన సేవలు ఎంతో హర్షనియమని అన్నారు. అబ్దుల్ కలాం యొక్క స్ఫూర్తితోనే వారి మార్గదర్శకంలోనే మేము అబ్దుల్ కలాం వాకర్స్ అసోసియేషన్స్ అని పేరు పెట్టుకోవడం కూడా జరిగింది. ఈ కార్యక్రమంలో అబ్దుల్ కలాం వాకర్స్ అసోసియేషన్స్ సభ్యులు బెజ్జం రమేష్, ఈక లక్ష్మయ్య, బత్తుల శ్రీనివాస్ గజ్జి మల్లేష్, పెనుక ప్రభాకర్ ,సంగేపు బాబు దబ్బకట్ల రమేష్, బోడ ఎల్లయ్య ,అశోక్, వెంకట్ రెడ్డి ,రాజు, లక్ష్మీనారాయణ , మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

సతీష్ యాదవ్ సేవలు అభినందనీయం



అక్షరశక్తి, ములుగు: తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ ములుగు జిల్లా అధ్యక్షులు గా సీనియర్ జర్నలిస్ట్ బేతి సతీష్ యాదవ్ ఎన్నిక కావటం హర్షనీయమని వెంకటాపూర్ గ్రామ సర్పం మామిడిశెట్టి సుగుణ అన్నారు. ఈ మేరకు ఆమె బుధవారం మండలకేంద్రంలోని తన నివాసంలో సతీష్ యాదవ్ ను శాలువాలతో ఘనంగా సన్మానం చేసి అభినందనలు తెలియజేసారు.మీడియా వృత్తి లో కొనసాగుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం గత కొన్నేళ్లుగా సతీష్ యాదవ్ చేస్తున్న సేవలను ఆమె కొనియాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుటుంబ సభ్యులు, స్వామి, ధర్మ, కోటి, స్థానిక జర్నలిస్ట్ లు పాల్గొన్నారు.

కె. సంతోష్ కుమార్‌కు లైఫ్ సేవర్ అవార్డు

అక్షరశక్తి, హనుమకొండ: భారత మాజీ రాష్ట్రపతి, దివంగత డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం (అక్టోబర్ 15) హనుమకొండలోని ఏపీజే అబ్దుల్ కలాం ఫౌండేషన్, యువ నేతాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమకొండకు చెందిన కె. సంతోష్ కుమార్ 29 సార్లు రక్తదానం చేసి, ఎంతోమంది ప్రాణాలను కాపాడేందుకు చేసిన సేవలకు గుర్తింపుగా లైఫ్ సేవర్ అవార్డు-2026 అందజేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ సలహాదారు సాధు నరసింహ రెడ్డి, సహ వ్యవస్థాపకుడు జముల వీర రెడ్డి, వ్యవస్థాపకుడు ఆనంద్ దేవునూరి పాల్గొన్నారు. రక్తదానం ద్వారా సమాజానికి సేవలందిస్తున్న సంతోష్ కుమార్‌ను వారు అభినందించారు.







చిరు వ్యాపారులపై దాడులు ఆపాలి

- ట్రైసిటీలో ప్రత్యేక సంతలు ఏర్పాటు చేయాలి: బీఆర్టీయూ, చిరు వ్యాపార సంఘాల నేతలు

అక్షరశక్తి,హనుమకొండ: చిరు వ్యాపారుల జీవనోపాధిని దెబ్బతీసే దాడులు, దుకాణాల కూల్చివేతలను వెంటనే నిలిపివేసి, వారికి శాశ్వత పరిష్కారం చూపాలని బీఆర్టీయూ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నాయిని రవి, చిరు వ్యాపారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్ డిమాండ్ చేశారు. హనుమకొండలో చిరు వ్యాపారుల దుకాణాల కూల్చివేతల నేపథ్యంలో భారత రాష్ట్ర సమితి జిల్లా కార్యాలయంలో బీఆర్టీయూ, చిరు వ్యాపార సంఘాల నాయకులు మీడియాతో మాట్లాడారు. గతంలో దాస్యం వినయ్‌భాస్కర్ ఎమ్మెల్యేగా ఉన్న 15 ఏళ్ల కాలంలో ఇలాంటి దాడులు జరగలేదని, ప్రస్తుత ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హయాంలో మూడేళ్లుగా చిరు వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయిని రవి ఆరోపించారు. పండ్ల దుకాణాల కూల్చివేతలతో లక్షలాది రూపాయల నష్టం వాటిల్లిందని, బాధితులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని కోరారు. చిరు వ్యాపారులపై చర్యలు తీసుకుంటూ పెద్ద వ్యాపారుల విషయంలో అధికారులు భిన్నంగా వ్యవహరించడం ఏమిటని ఎండీ ఇస్మాయిల్ ప్రశ్నించారు. పాలకులకు చిత్తశుద్ధి ఉంటే హనుమకొండ, వరంగల్, కాజీపేట నగరాల్లో చిరు వ్యాపారుల కోసం ప్రత్యేక సంతలు, వీధి వ్యాపార ప్రాంతాలు ఏర్పాటు చేయాలని సూచించారు. తాత్కాలిక చర్యలతో సమస్య పరిష్కారం కాదని, చిరు వ్యాపారుల జీవనోపాధి, సామాజిక భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. గత మూడేళ్లలో కలెక్టర్, పోలీస్ కమిషనర్, మున్సిపల్ కమిషనర్ స్థాయిలో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపలేదని విమర్శించారు. బీఆర్ఎస్ నాయకుడు ఎస్కే మహమూద్ మాట్లాడుతూ చిరు వ్యాపారులపై కాకుండా రహదారులను ఆక్రమించిన పెద్ద వ్యాపారులపై కూడా చర్యలు తీసుకోవాలని అన్నారు. అధికారులే అన్ని నిర్ణయాలు తీసుకుంటున్నప్పుడు ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి బాధ్యత ఏమిటని ప్రశ్నించారు. నగరంలో చిరు వ్యాపారుల సమస్యలతో పాటు మౌలిక సదుపాయాల అభివృద్ధిపైనా అధికారులు దృష్టి సారించాలని కోరారు. కాజీపేట వంతెన వద్ద మూడేళ్లుగా కనీసం మట్టి పోసే పనులు కూడా చేపట్టలేదని విమర్శించారు. కూల్చివేతలు, ఎగవేతలు, కోతలే కాంగ్రెస్ మూడేళ్ల పాలనగా మారిందని ఆయన ఆరోపించారు.

ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సోదా కిరణ్, చిరు వ్యాపార సంఘ నాయకులు మహమ్మద్ మూర్తజా, హరి చంద్రు, మోయిన్, మైనారిటీ నాయకులు నాయిముద్దీన్, భవన నిర్మాణ రంగ కార్మిక నాయకులు ఇంజాల మల్లేశం, తేలు సారంగపాణి, పాలడుగుల శివకుమార్, సిరికొండ భిక్షపతి, ఎండీ సాదిక్, నారాయణగిరి రాజు, గంగరాజు రాజు, సదాంత్, సారిక తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భద్రతే లక్ష్యం..

- గ్రామాల్లో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం
- పత్రాలు లేదా నంబర్ ప్లేట్లు లేని 24 వాహనాలు గుర్తింపు
- గంజాయి, అక్రమ మద్యం నిర్మూలనపై ప్రత్యేక నిఘా..
- ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన



అక్షరశక్తి, మహబూబాబాద్: జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో గూడూరు సర్కిల్ పరిధిలోని కొత్తగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో రౌతుగూడెం, చింతగట్టు తండా గ్రామాల్లో గురువారం తెల్లవారుజామున 5:30 గంటల నుంచి 7:30 గంటల వరకు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 35 మంది పోలీసు సిబ్బంది పాల్గొని సుమారు 120 ఇళ్ల పరిధిలో తనిఖీలు చేపట్టారు. వాహనాలను తనిఖీ చేయడంతో పాటు అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలపై ఆరా తీశారు. సరైన పత్రాలు లేదా నంబర్ ప్లేట్లు లేని 24 వాహనాలను గుర్తించారు. అలాగే 15 లీటర్ల అక్రమ మద్యం (గుడుంబా), సుమారు 500 లీటర్ల బెల్లం వాష్‌ను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు రోడ్డు భద్రత, గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల నిర్మూలన, సైబర్ నేరాల నివారణ, గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా నేరాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. గ్రామాల్లో నేరాల నియంత్రణ, అక్రమ కార్యకలాపాల నివారణ, పోలీస్-ప్రజల మధ్య సత్సంబంధాల బలోపేతం, ప్రజల భద్రతను పెంపొందించడమే లక్ష్యంగా కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలు నిర్వహిస్తున్నట్లు గూడూరు సీఐ వినయ్ తెలిపారు.

కలాం ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలి

సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్

అక్షరశక్తి, హనుమకొండ: భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా గురువారం సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ, కలాం జీవితం, ఆయన ఆశయాలు నేటి యువతకు ఆదర్శప్రాయమని అన్నారు. సాధారణ కుటుంబంలో జన్మించి తన ప్రతిభ, పట్టుదల, కృషితో దేశ అత్యున్నత పదవిని అధిరోహించిన కలాం జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. విద్య, విజ్ఞానం, క్రమశిక్షణ, నిరంతర శ్రమతోనే ఉన్నత లక్ష్యాలను సాధించగలమని కలాం నిరూపించారని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని, స్పష్టమైన లక్ష్యాలను ఏర్పరచుకొని దేశాభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. యువతలో శాస్త్రీయ దృక్పథం, దేశభక్తి, సేవాభావం పెంపొందించడమే కలాంకు అందించే నిజమైన నివాళి అని నిమ్మల శ్రీనివాస్ అన్నారు. కలలు కనడమే కాకుండా, వాటిని సాకారం చేసుకునేందుకు నిరంతరం కృషి చేయాలని సూచించారు.



విద్యుత్ సంక్షోభానికి ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలే కారణం

- సింగరేణి బకాయిలు చెల్లించి బొగ్గు ఉత్పత్తి పెంచాలి: గండ్ర



అక్షరశక్తి, భూపాలపల్లి: రాష్ట్రంలో నెలకొన్న విద్యుత్ సంక్షోభానికి ప్రభుత్వ ముందుచూపు లేని నిర్ణయాలే కారణమని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి విమర్శించారు. గురువారం భూపాలపల్లి లోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మోటార్లు పనిచేయక పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణికి చెల్లించాల్సిన బకాయిలు చెల్లించి బొగ్గు ఉత్పత్తిని పెంచాలని, విద్యుత్ కేంద్రాలకు నిరంతరంగా బొగ్గు సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యుత్ రంగానికి సంబంధించి సుమారు రూ.60 వేల కోట్ల బకాయిలు ఉన్నాయని ఆయన ఆరోపించారు. చెల్పూర్ జెన్‌కో విద్యుత్ కేంద్రంలో 1,100 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం ఉన్నప్పటికీ ప్రస్తుతం 400 నుంచి 600 మెగావాట్ల మేరకే ఉత్పత్తి జరుగుతోందని తెలిపారు. విద్యుత్ కొరతను ముందుగానే అంచనా వేసి, అవసరమైతే ఇతర రాష్ట్రాల నుంచి విద్యుత్ కొనుగోలు చేసి రైతులకు సరఫరా చేయాలని సూచించారు.

దేవాదుల ఎత్తిపోతల పథకానికి పూర్తిస్థాయిలో విద్యుత్ అందించి సాగునీరు, తాగునీటి సరఫరాకు ఆటంకాలు లేకుండా చూడాలని కోరారు. వరి పంటలు కీలక దశలో ఉన్నందున రాబోయే 15 రోజుల నుంచి నెల రోజుల పాటు నిరంతర విద్యుత్ అందించడం అత్యవసరమని పేర్కొన్నారు.

ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతుల సమస్యలను పరిష్కరించాలని, లేకపోతే రైతుల పక్షాన ఉద్యమించి రోడ్లపైకి వచ్చి ప్రభుత్వాన్ని నిలదీస్తామని గండ్ర వెంకట రమణా రెడ్డి హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

నగరంలో హాఫ్ మారథాన్..
ట్రైసిటీలో ట్రాఫిక్ ఆంక్షలు

- 17న ఉదయం 4 నుంచి 10 గంటల వరకు ఆంక్షలు..
- ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని పోలీసుల సూచన



అక్షరశక్తి, వరంగల్: వరంగల్, హనుమకొండ, కాజీపేట నగరాల్లో ఈ నెల 17న నిర్వహించనున్న హాఫ్ మారథాన్ పరుగు నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 4 గంటల నుంచి 10 గంటల వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు. ప్రజలు, ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించాలని సూచించారు.

హైదరాబాద్ వెళ్లే, వచ్చే వాహనాలకు మార్గాలు

హైదరాబాద్ నుంచి హనుమకొండకు వచ్చే వాహనాలు, బస్సులు ఫాతిమా సెంటర్ నుంచి మదర్ థెరిసా సెంటర్ మీదుగా ఎడమవైపు తిరిగి వడ్డేపల్లి చర్చి, తులసి బార్, కేయూసీ జంక్షన్, నయీంనగర్, సీపీఓ జంక్షన్ మీదుగా హనుమకొండ బస్టాండ్‌కు చేరుకోవాలి. హనుమకొండ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే వాహనాలు అశోక జంక్షన్, ములుగు రోడ్డు, పెద్దమ్మగడ్డ, కేయూసీ, తిరుమల బార్, వడ్డేపల్లి చర్చి, ఫాతిమా సెంటర్, కాజీపేట మీదుగా వెళ్లాలి.

కరీంనగర్, ఖమ్మం మార్గాల్లో మళ్లింపులు

హనుమకొండ నుంచి కరీంనగర్‌కు వెళ్లే వాహనాలు అశోక జంక్షన్, ములుగు రోడ్డు, పెద్దమ్మగడ్డ, కేయూసీ మీదుగా వెళ్లాలని పోలీసులు సూచించారు. ఖమ్మం నుంచి హనుమకొండకు వచ్చే వాహనాలు సీఎస్ఆర్ గార్డెన్ జంక్షన్ వద్ద మళ్లింపు తీసుకుని పోతన జంక్షన్ మీదుగా హనుమకొండకు చేరుకోవాలి.

మూడు మార్గాల్లో వాహనాల రాకపోకలు బంద్.....

మారథాన్ జరిగే సమయంలో 100 ఫీట్ల రోడ్డుపై ఒకవైపు మాత్రమే వాహనాలకు అనుమతి ఉంటుంది. సీఎస్ఆర్ గార్డెన్ జంక్షన్ నుంచి అదాలత్ వైపు, అంబేడ్కర్ జంక్షన్ నుంచి కాలేజీ జంక్షన్ వరకు, ఫాతిమా జంక్షన్ నుంచి జాతీయ సాంకేతిక విద్యాసంస్థ (ఎన్ఐటీ) వైపు ఎలాంటి వాహనాలకు అనుమతి ఉండదని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ నెల 17న ఉదయం 4 నుంచి 10 గంటల వరకు వాహనదారులు ట్రాఫిక్ ఆంక్షలను గమనించి పోలీసులకు సహకరించాలని కోరారు.

సాఫ్ట్ బాల్ పోటీలను విజయవంతం చేయాలి



అక్షరశక్తి,హనుమకొండ: హనుమకొండ జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 16, 17వ తేదీలలో ములుగు రోడ్డు లోని లాల్ బహదూర్ కళాశాల క్రీడా మైదానంలో జరగనున్న మినీ సబ్ జూనియర్ సాఫ్ట్బాల్ ఛాంపియన్షిప్ బాలుర పోటీలను విజయవంతం చేయాలని మాజీ కార్పొరేటర్ బోడ డిన్న కోరారు. ఎల్బి కళాశాల క్రీడామైదానంలో కొనసాగుతున్న టోర్నమెంట్ ఏర్పాట్లను.. క్రీడాకారులకు ఇస్తున్న శిక్షణను ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. సాఫ్ట్ బాల్ అసోసియేషన్ సేవలను అభినందించారు. అసోసియేషన్ సేవలను సద్వినియోగం చేసుకుని జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని సూచించారు. చెడు వ్యసనాలకు గురికాకుండా క్రీడలు దోహదం చేస్తాయన్నారు. సాఫ్ట్ బాల్ అసోసియేషన్ సేవలకు తమ వంతు సహాయ సహకారాలను అందిస్తానని తెలిపారు. అంతకుముందు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరీలు తాబేటి రాజేందర్, ఎం. భగత్, ఉపాధ్యక్షులు పెరుమాండ్ల సాంబమూర్తి, జాయింట్ సెక్రటరీలు సుమలత, రాజేశ్వర్, కోచ్ లు పోలేపాక వినయ్ కుమార్, తాబేటి నాగరాజు, బుస రాజు, ఏ. సృజన, సుష్మ, శశాంక్, క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల డిమాండ్లు న్యాయమైనవి

వారి పోరాటానికి బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు



అక్షరశక్తి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం) లో పనిచేస్తున్న ఉద్యోగుల డిమాండ్లు న్యాయమైనవని బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. ఉద్యోగుల సమస్యలపై పార్టీ తరపున అధ్యయనం చేస్తామని, వారి పోరాటానికి సంపూర్ణ మద్దతు అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ మాజీ చీఫ్‌విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ ఆధ్వర్యంలో ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి (జేఏసీ) అధ్యక్షుడు డాక్టర్ మహేందర్ రావు, అధికార ప్రతినిధి డాక్టర్ బోడ శ్రీనివాస్, హనుమకొండ జిల్లా బాధ్యుడు వినయ్ కుమార్, మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా జేఏసీ బాధ్యుడు కుమార్ హైదరాబాద్‌లోని కేటీఆర్ నివాసంలో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, తమ డిమాండ్లను కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల నిర్వహించిన కార్యక్రమాలు, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న పోరాట వివరాలను ఆయనకు వివరించారు. తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఉద్యోగుల సమస్యలను విన్న కేటీఆర్ సానుకూలంగా స్పందించారు. ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం వారి పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

మహిళల భద్రతపై అవగాహన కలిగి ఉండాలి

టీ-సేఫ్ ఆప్‌ను వినియోగించుకోవాలి: షీ టీమ్ ఎస్సై రామారావు



అక్షరశక్తి, వరంగల్: మహిళల భద్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, అప్రమత్తంగా ఉండటం ద్వారా మహిళలపై జరిగే నేరాలను అరికట్టవచ్చని వరంగల్ షీ టీమ్ ఎస్సై రామారావు అన్నారు. వరంగల్‌లోని కరీమాబాద్ కాసం షాపింగ్ మాల్ గోదాంలో సుమారు 150 మంది సిబ్బందికి మహిళల భద్రత, సైబర్ నేరాలు, టీసేఫ్ ఆప్ వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై రామారావు మాట్లాడుతూ ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్, టెలిగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత ఫొటోలు, వివరాలను పంచుకునే విషయంలో మహిళలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తులతో వ్యక్తిగత విషయాలను పంచుకోవద్దని, సైబర్ నేరాల పట్ల అవగాహన పెంచుకోవాలని తెలిపారు. మహిళలు ఒంటరిగా తెలియని ప్రదేశాలకు ప్రయాణించాల్సి వచ్చినప్పుడు టీసేఫ్ ఆప్‌ను వినియోగించుకోవాలని సూచించారు. ఉద్యోగ ప్రదేశాల్లో అసభ్యకరంగా ప్రవర్తించే వ్యక్తులు, ఆకతాయిల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఎవరైనా మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తే భయపడకుండా వెంటనే షీ టీమ్ పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. మహిళల భద్రతకు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనర్ వాట్సాప్ నంబర్ 8712685257, సీఐ వాట్సాప్ నంబర్ 8712685142, ఎస్సై వాట్సాప్ నంబర్ 8712685270 ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని, నేరాలకు పాల్పడిన వారిపై విచారణ జరిపి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని వివరించారు. ఈ కార్యక్రమంలో కాసం షాపింగ్ మాల్ గోదాం ఇన్‌చార్జి రాహుల్, షీ టీమ్ ఎస్సై రామారావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గౌతమి కి డాక్టరేట్



అక్షరశక్తి,కేయూ క్యాంపస్: కాకతీయ విశ్వవిద్యాలయ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ విభాగ పరిశోధక విద్యార్థిని గౌతమి తుమ్మ కు విశ్వవిద్యాలయ పరిక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ కట్ల డాక్టరేట్ ప్రకటించారు, డాక్టర్ గౌతమి తుమ్మ "design, development and evaluation of nanoparticulate drug delivery system to enhance bioavailability of some drugs" అనే అంశం పై విభాగ సహా ఆచార్యులు డాక్టర్ షాయెద పర్యవేక్షణలో పూర్తీ చేసారు, మడికొండ గ్రామంకు చెందినా డాక్టర్ గౌతమి తుమ్మ ను పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు అబినందించారు.

దుర్గ పోలాటి కి డాక్టరేట్




అక్షరశక్తి,కేయూ క్యాంపస్: కాకతీయ విశ్వవిద్యాలయ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ విభాగ పరిశోధక విద్యార్థిని దుర్గ పోలాటి కి విశ్వవిద్యాలయ పరిక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ కట్ల డాక్టరేట్ ప్రకటించారు, డాక్టర్ దుర్గ పోలాటి "improvising anticancer activity of polyphenols in animals by cocrystal technology", అనే అంశం పై విభాగ ఆచార్యులు, డీన్ ఆచార్య ఎన్. ప్రసాద్ పర్యవేక్షణలో పూర్తీ చేసారు, హనంకొండ కు చెందినా డాక్టర్ దుర్గ పోలాటి, ప్రస్తుతం బొల్లికుంట లోని వాగ్దేవి ఫార్మసీ కాలేజీ లో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పని చేస్తున్నారు, పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు డాక్టర్ దుర్గ పోలాటి ని అబినందించారు.


సొంతింటి కలను నిజం చేస్తున్న కాంగ్రెస్



అక్షరశక్తి, గూడూరు: గూడూరు మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని చంద్రు గూడెంలో గడిలా లావణ్య-కార్తీక్ దంపతుల ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమాన్ని సర్పంచ్ వాంకుడోత్ సునీత కొమ్మాలు నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె లబ్ధిదారుల కుటుంబానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, నూతన గృహంలో ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. నిరుపేదల సొంతింటి కలను నిజం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల, పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గజరాజుల సందడి.. ఆకాశం నుంచి కనువిందు...





అక్షరశక్తి, మహారాష్ట్ర: మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా కమలాపూర్ ప్రాంతంలోని ఏనుగుల పార్క్ దృశ్యాలను కాకతీయ యూనివర్సిటీ మాస్టర్ ఆఫ్ టూరిజం అండ్ మేనేజ్మెంట్ విద్యార్థి దేశెట్టి నవీన్ పటేల్ స్టడీ టూర్ లో భాగంగా తన డ్రోన్తో చిత్రీకరించారు. ఈ అద్భుత దృశ్యాలను సేకరించించారు . పార్క్ అందాలతో పాటు గజరాజుల విహారం ఆకాశం నుంచి చిత్రీకరించిన విజువల్స్ ఆకట్టుకుంటున్నాయి.

జక్కుల రాజు యాదవ్ కు డాక్టరేట్



అక్షరశక్తి, వరంగల్: రాయపర్తి మండలం మహబూబ్‌నగర్ గ్రామానికి చెందిన జక్కుల రాజు యాదవ్ కాకతీయ విశ్వవిద్యాలయంలో ఆర్థికశాస్త్రంలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ప్రొఫెసర్ బంగారం సురేష్ లాల్ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసి డాక్టరేట్ సాధించారు. జక్కుల రాజు యాదవ్ కాకతీయ విశ్వవిద్యాలయంలో ఎం.ఏ. ఆర్థికశాస్త్రంతో పాటు ఎం.ఫిల్ పూర్తి చేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయంలో విశ్వవిద్యాలయంలో జేఏసీ సహ కన్వీనర్‌గా పనిచేస్తూ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. ఈ క్రమంలో పలు కేసులను ఎదుర్కొన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయ విద్యార్థులతో కలిసి 450 కిలోమీటర్ల పాదయాత్రకు కన్వీనర్‌గా వ్యవహరించి తెలంగాణ ఉద్యమంలో తన వంతు పాత్ర పోషించారు. 2012 నుంచి భీమారం ప్రాంతంలో ఎర్రగట్టుగుట్ట సమీపంలో ఎన్ఆర్ఐ జూనియర్ కళాశాలను స్థాపించి, అప్పటి నుంచి కార్యదర్శి, కరస్పాండెంట్‌తో పాటు ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో కళాశాల నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్నారు. అదేవిధంగా తెలంగాణ ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్య సంఘం (టీపీజేఎంఏ) ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తూ ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయనకు సహచరులు, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

ఉద్యోగుల సమస్యలపై రాష్ట్రస్థాయి నాయకులతో ముఖాముఖి

తెలంగాణా జేఏసీ జిల్లా చైర్మన్ గా ఇక్బాల్



అక్షరశక్తి, హనుమకొండ: ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి (టీజీఈజేఏసీ) రాష్ట్ర చైర్మన్ లచ్చిరెడ్డి, వివిధ ఉద్యోగ సంఘాల రాష్ట్ర నాయకులతో ముఖాముఖి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ జేఏసీ వరంగల్ జిల్లా చైర్మన్ గా తహసీల్దార్ ఇక్బాల్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం మధ్యాహ్నం 2 గంటలకు హనుమకొండ లోని భద్రకాళి దేవాలయం ఎదురుగా ఉన్న పోతులూరి వీరబ్రహ్మం కమిటీ హాల్‌లో ఈ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి టీజీఈజేఏసీ రాష్ట్ర సెక్రటరీ జనరల్ వి. రాజశేఖర్, తెలంగాణ ఉపాధ్యాయ సంఘం (టీజీటీఏ) రాష్ట్ర అధ్యక్షుడు రాములు, ప్రధాన కార్యదర్శి రమేష్ పాక, సహాధ్యక్షుడు మహమ్మద్ ఇక్బాల్, కార్యనిర్వాహక కార్యదర్శి కె. విక్రమ్ కుమార్, తెలంగాణ ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు నిర్మల, టీజీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు భాణాల రామ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి భిక్షు, సహాధ్యక్షురాలు కుమ్మరి రేణుక, బీసీటీఏ అధ్యక్షుడు కృష్ణుడు హాజరుకానున్నారు.

అలాగే జీపీఓల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గరికే ఉపేందర్ రావు, ప్రధాన కార్యదర్శి మల్లారం అర్జున్, మహిళా అధ్యక్షురాలు కంది శిరీష రెడ్డి, దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు హబీబ్, ప్రభుత్వ అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు కుమార్ యారా, ఎస్‌జీటీయూ అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శుల సమాఖ్య అధ్యక్షుడు శ్రీకాంత్, బీసీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ గౌడ్, ఆర్. విజయ్ తదితరులు పాల్గొననున్నారు.

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను రాష్ట్ర నాయకుల దృష్టికి తీసుకెళ్లడంతోపాటు, వివిధ శాఖల ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అవసరమైన కార్యాచరణపై ఈ సమావేశంలో చర్చించారు. ఉద్యోగులంతా సమావేశానికి హాజరై తమ సమస్యలను నాయకుల దృష్టికి తీసుకురావాలని ఇక్బాల్ అన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం లక్ష్యం





పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలి: డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి

అక్షరశక్తి,హనుమకొండ: వరంగల్,ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం హనుమకొండ జిల్లా మడికొండలోని సత్య సాయి కన్వెన్షన్‌లో నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థికి పట్టభద్రులు భారీ మెజారిటీతో విజయం అందించారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఉద్యోగ నియామకాలు, విద్యా, ఉపాధి రంగాల్లో సాధిస్తున్న ప్రగతిని పట్టభద్రులకు వివరించి, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రముఖులు

ఈ సమావేశానికి ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి హాజరయ్యారు. ఎంపీలు బలరాం నాయక్, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీలు బస్వరాజు సారయ్య, శంకర్ నాయక్, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, దొంతి మాధవరెడ్డి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, గంప్ర సత్యనారాయణ రావు, కె.ఆర్. నాగరాజు, హనుమాండ్ల యశస్విని రెడ్డి, జాటోత్ రాంచంద్రు నాయక్, డాక్టర్ భూక్య మురళి నాయక్, టీపీసీసీ మహిళా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు, పార్టీ నాయకులు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

దసరా నుంచి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఓపీ సేవలు!





- నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రులు..
- ఉత్తర తెలంగాణ ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తాం: పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



అక్షరశక్తి, వరంగల్: వరంగల్‌లో నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా గురువారం ఆసుపత్రి నిర్మాణ పనులను వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి ధనసరి సీతక్క, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి తదితర రాష్ట్ర, జిల్లా నాయకులు, అధికారులు పరిశీలించారు. ప్రస్తుతం కొనసాగుతున్న నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కొండా సురేఖ గైర్హాజరు అయ్యారు.

దసరా నుంచి ఓపీ సేవలు ప్రారంభం....

అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన నూతన ఆసుపత్రి నిర్మాణ పనులను వేగవంతం చేసి తుది దశకు తీసుకొచ్చామని తెలిపారు. దసరా సందర్భంగా నూతన ఆసుపత్రిలో ఓపీ సేవలను ప్రారంభిస్తామని వెల్లడించారు. ఈ ఆసుపత్రి అందుబాటులోకి వస్తే ఉత్తర తెలంగాణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.

నిమ్స్ తరహాలో వైద్య సేవలు....

రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తోందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభ పరిస్థితులు ఉన్నప్పటికీ ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో ఆసుపత్రి నిర్మాణ పనులను పూర్తి చేసే దిశగా చర్యలు చేపట్టినట్లు వివరించారు. నూతన ఆసుపత్రిలో ఓపీ సేవలు ప్రారంభమైతే రోగుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని, నిమ్స్‌లో ఎలాంటి వైద్య సేవలు అందుతున్నాయో అదే తరహాలో వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలోనూ సేవలు అందించేందుకు కృషి చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ఉత్తర తెలంగాణ ప్రజలు మెరుగైన వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గించి, వరంగల్‌లోనే ఆధునిక వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఈ సందర్భంగా తెలిపారు.

కానిస్టేబుల్ దిలీప్‌ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే గండ్ర



అక్షరశక్తి, హైదరాబాద్: ఆరెపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ దిలీప్‌ను భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి పరామర్శించారు. గతంలో తన వద్ద గన్‌మెన్‌గా పనిచేసిన దిలీప్ డ్యూటీ ముగించుకుని హనుమకొండకు వెళ్తున్న క్రమంలో ప్రమాదానికి గురయ్యారు. ఆసుపత్రికి వెళ్లిన గండ్ర వెంకట రమణా రెడ్డి దిలీప్ ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయనకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. అనంతరం దిలీప్ కుటుంబ సభ్యులను గండ్ర వెంకట రమణా రెడ్డి పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. దిలీప్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

రూ.1.20 లక్షల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన అసిస్టెంట్ ఇంజినీర్

విద్యుత్ మీటర్ల మంజూరుకు లంచం డిమాండ్



అక్షరశక్తి, హైదరాబాద్: విద్యుత్ మీటర్ల మంజూరు కోసం రూ.1,20,000 లంచం తీసుకుంటూ హైదరాబాద్‌లోని మదన్నపేట విద్యుత్ విభాగం అసిస్టెంట్ ఇంజినీర్ పందాల సందయ్య రాకేష్ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు పట్టుబడ్డారు. గురువారం (అక్టోబర్ 15, 2026) ఏసీబీ సిటీ రేంజ్ 2 అధికారులు ఈ చర్య చేపట్టారు. పాత విద్యుత్ మీటర్లు కనిపించకుండా పోవడంతో వాటి స్థానంలో ఆరు కొత్త మీటర్లను మంజూరు చేయాలని దరఖాస్తుదారులు కోరారు. ఈ క్రమంలో ఆన్‌లైన్ దరఖాస్తులను ఆమోదించేందుకు అసిస్టెంట్ ఇంజినీర్ రూ.1.20 లక్షల లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ తన ప్రకటనలో పేర్కొంది. లంచం తీసుకుంటున్న సమయంలో అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని, ఆయన వద్ద నుంచి నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని నాంపల్లిలోని ప్రత్యేక ఏసీబీ కోర్టు న్యాయమూర్తి ఎదుట హాజరు పరచనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

దిగాలు దసరా..!

- వెలవెలబోతున్న వ్యాపారం
- నగరంలో మందగించిన బట్టల వ్యాపారం
- కొనుగోళ్లపై ప్రజల ఆచితూచి అడుగులు *ఆన్‌లైన్ విక్రయాలతో స్థానిక వ్యాపారులకు పోటీ
- తగ్గిన కొనుగోలు శక్తి



అక్షరశక్తి, ప్రధాన ప్రతినిధి: దసరా పండుగ వచ్చిందంటే కొత్త బట్టల కొనుగోళ్ల తో వస్త్ర దుకాణాలు కళకళలాడుతాయి. ముఖ్యంగా వరంగల్, హనుమకొండ నగరాల్లోని వస్త్ర దుకాణాలకు, కిరాణా సామాను పండుగ సీజన్ కీలకమైన వ్యాపార సమయం. అయితే ఈసారి దసరాకు ముందునుంచే పండగ వ్యాపారం ఆశించిన స్థాయిలో సాగడం లేదనే ఆందోళన వ్యాపార వర్గాల్లో కనిపిస్తోంది. పండుగ సీజన్‌లో సాధారణంగా ఉండే కొనుగోళ్ల సందడి తగ్గడానికి గల కారణాలపై చర్చ జరుగుతోంది. ఒకవైపు అనూహ్యంగా అన్ని వస్తువుల మీద పెరుగు తున్న రెట్లు, వర్షాలు లేకపోవడం, ఎల్ నినో భయం భవిష్యత్తు ఎలా ఉంటుందో అన్న సందేహాలు ఖర్చుల పరిమితులపై ప్రజలు స్వీయ ఆంక్షలు విధించుకుంటున్నట్టు తెలుస్తున్నది. సాధారణ బడ్జెట్ కు మించి ఖర్చులు పెరగడం, ఆన్లైన్ కొనుగోళ్లు పండగ మార్కెట్ పై ప్రభావం చూపుతున్నాయి.

ఖర్చుల భారం కొనుగోళ్లకు కళ్లెం....

నిత్యావసర వస్తువుల ధరలు, ఇంటి అద్దెలు, విద్య, వైద్యం, రవాణా వంటి ఖర్చులు పెరగడంతో కుటుంబాల నెలవారీ బడ్జెట్ పై ఒత్తిడి పెరుగుతోంది. దీంతో కొత్త బట్టల కొనుగోళ్లకు కేటాయించే మొత్తాన్ని కొందరు తగ్గిస్తున్నట్లు భావిస్తున్నారు. కుటుంబంలోని అందరికీ కొత్త దుస్తులు కొనుగోలు చేయడానికి బదులుగా అవసరమైన వారికే కొనడం, ఖరీదైన దుస్తుల స్థానంలో తక్కువ ధరకు లభించే వాటిని ఎంచుకోవడం వంటి ధోరణులు వస్త్ర వ్యాపారాన్ని ప్రభావితం చేస్తున్నది. ఏదైనా షాపింగ్ చెయ్యాలి అంటే సగటు వ్యక్తి ఒకటికి పదిసార్లు ఆలోచించాల్సి వస్తున్నది.

ఆన్ లైన్ వ్యాపారంతో పెరిగిన పోటీ...

అంతర్జాల వేదికలు అందిస్తున్న రాయితీలు, ప్రత్యేక విక్రయాలు, ఇంటి నుంచే ధరలను పోల్చుకుని కొనుగోలు చేసే సౌకర్యం స్థానిక వస్త్ర దుకాణాలకు పోటీగా మారుతోంది. వినియోగదారులు దుకాణాల్లో దుస్తులను పరిశీలించినప్పటికీ, వాటి ధరలను అంతర్జాల వేదికలతో పోల్చుకుని నిర్ణయం తీసుకుంటున్నారు. దీంతో ధరల్లో పోటీ పడాల్సిన పరిస్థితి ఏర్పడటంతో పాటు, వినియోగదారులను ఆకర్షించేందుకు స్థానిక వ్యాపారులు ప్రత్యేక రాయితీలు ప్రకటించాల్సిన అవసరం ఏర్పడుతోంది. వస్త్రాల కొనుగోలు ధరలు, దుకాణాల అద్దెలు, విద్యుత్ బిల్లులు, సిబ్బంది వేతనాలు, ఇతర నిర్వహణ ఖర్చులు నగరంలో వ్యాపారులకు భారంగా మారింది. మరోవైపు వినియోగదారులు తక్కువ ధరలకే నాణ్యమైన దుస్తులు కోరుకుంటున్నారు. అందుకే ఆన్ లైన్ షాపింగ్ ను ఆశ్రయిస్తున్నారు. ప్రధానంగా యువతరం 70 శాతం ఆన్ లైన్ షాపింగ్ చెయ్యడానికే ఇష్టపడుతున్నారని తెలుస్తున్నది.

డిస్కౌంట్ వ్యాపారాలు...

ఒకప్పుడు పండగ సందర్భంగా దుకాణదారులు 10 శాతం నుండి 20 శాతం వరకు డిస్కౌంట్ ఇచ్చేవాళ్ళు. ఆ సమయంలో పండగను దృష్టిలో పెట్టుకొని ప్రకటించే ఆకర్షణీయ ఆఫర్లకు డిమాండ్ చాలా ఉండేది. ఇప్పుడు కార్పొరేట్లు ఏడాది పొడవునా ఆఫర్ల తో ఆకర్షిస్తుండటం వల్ల స్థానిక వ్యాపారస్తుల బిజినెస్ లు అనూహ్యంగా తగ్గిపోయాయి. సందర్భం ఏదైనా ఆఫర్ అంటూ హడావిడి చేసే ఆన్లైన్ వ్యాపార ఎత్తుగడలతో పోటీపడలేక పోతున్నారు. అందుకే నగరంలో బిజినెస్ బాగా తగ్గిందని వ్యాపారస్థులు అంటున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఇరవై శాతానికి పైగా బిజినెస్ తగ్గిందని నక్కలగుట్టలోని వ్యాపారస్థులు చెబుతున్నారు.

Printer, Publisher by Palle Ravi Vamshi Mohan on behalf M/s Creative Media Group by Printed at Ramani Web Offset Printers H.No. 8-82/11/1, Autonagar, Bommakal Village, Mdl&Dist: Karimnagar-505001. T.S. Published at H.No. 2-1-14, Saraswathi Nagar, Vidyaranyapuri, Mdl: Hanamkonda, Dist: Warangal-506009. T.S. Editor: Dr PR Vamshimohan.